క్లుప్తంగా

నష్టంపై నివేదికలు తయారు చేయాలి

మహబూబాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో మానుకోట మున్సిపల్ పరిధిలో జరిగిన నష్టంపై నివేదికలను వెంటనే తయారు చేయాలని మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషనర్ నోముల రవీందర్, డీఈ సీహెచ్ ఉపేందర్, మేనేజర్ శ్రీదర్, టీపీఎస్ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు. బంధం చెరువు వద్ద జరుగుతున్న పనులు త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

దరఖాస్తుల ఆహ్వానం

తొర్రూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బొలగాని రాములు తెలిపారు. ఇంగ్లిష్‌లో రెండు, జువాలజీ విభాగంలో ఒక పోస్టు ఖాళీగా ఉందన్నారు. సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీ, సెట్, నెట్, పీహెచ్‌డీ తోపాటు బోధనానుభవం ఉండాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 9 సాయంత్రం 4.30గంటల వరకు దరఖాస్తులు కళాశాలలో అందించాలన్నారు. ఇతర వివరాలకు 95421 10611 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

మహబూబాబాద్ అర్బన్: మహబూబాబాద్‌లోని నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.లక్ష్మణ్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి గానూ తెలుగు–2, ఇంగ్లిష్–2, కామర్స్–1, పొలిటికల్ సైన్స్– 1 ఖాళీలు ఉన్నాయన్నారు. జనరల్, బీసీ అభ్యర్థులకు సంబంధిత పీజీ సబ్జెక్టులో 55శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 9వ తేదీ సాయంత్రం 4.30గంటల వరకు దరఖాస్తులను కళాశాలలో అందజేయాలని సూచించారు.

బియ్యం ఏటి పాలు



మరిపెడ రూరల్: వందలాది క్వింటాళ్ల బియ్యం ఏటి పాలయ్యాయి. వరద దాటికి ఇళ్లలో తడిసిన ముద్దయిన బియ్యాన్ని ట్రాక్టర్ ద్వారా సేకరించి అదే ఏటిలో పారబోశారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి ఆకేరు వాగు ఉధృతికి మండలంలోని ఉలెపల్లి గ్రామంలోని ఇళ్లలో సామగ్రి, నిత్యావసర వస్తువులు తడిసి ముద్దయ్యాయి.

పొంచి ఉన్న ప్రమాదం




కురవి: భారీ వర్షాలకు మండలంలోని అయ్యగారిపల్లి గ్రామ శివారులోని పెద్ద చెరువు కింది భాగంలో 365 జాతీయ రహదారి కోతకు గురైంది. రాత్రి వేళ రోడ్డుపై రాకపోకలు జరిపే వాహనాలు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్య తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

రూ.కోటి నష్టం

మరిపెడ రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షానికి వరదలదాటికి విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలి సుమారు రూ.కోటి నష్టం వాటిల్లిందని విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ కె.ఎస్ గుట్ట అన్నారు. మండలంలోని ఉల్లెపల్లి, బీచ్‌రాజ్‌పల్లి, సీతారాంతండా శివారు ఆకేరు వాగు పరివాహక ప్రాంతాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఆయన వెంట డీఈ మధుసూదన్, ఏఈ పావని పాల్గొన్నారు.

నేలవాలిన పెసర



నర్సింహులపేట: మండలంలోని గోల్‌బోడ్కతండా శివారు దూప్యాతండాలో గుగులోతు పట్టాభికి చెందిన పెసర పంట నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చేతికందే సమయంలో నేలమట్టమయింది. రెండు ఎకరాల్లో సుమారు రూ. లక్ష దిగుబడి నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశాడు. నష్టం పరిహారం అందించాలని రైతు కోరాడు.

హాస్టళ్ల తనిఖీ

నర్సింహులపేట: మండల కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్, మోడల్ స్కూల్ హాస్టల్‌ను బుధవారం మండల ప్రత్యేకాధికారి ప్రేమ్‌కుమార్, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ మాధవి సందర్శించి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టళ్లలో భోజనం పరిశీలించారు.

అధైర్యం వద్దు.. మేమున్నాం



డోర్నకల్: సరుకులు అందజేస్తున్న గంగాధర్



మహబూబాబాద్ రూరల్: బియ్యం పంపిణీ చేస్తున్న అంజయ్య



నెల్లికుదురు: సరుకులు అందిస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ బాధ్యులు



కురవి: నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న భరత్‌చందర్‌రెడ్డి



మరిపెడ రూరల్: సీతారాంతండాలో ఆహార ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న టీచర్స్ క్లబ్ బాధ్యులు

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

కురవి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని నల్లెల్ల గ్రామంలో చెరువు వరద వల్ల మునిగిపోయిన ముంపు బాధితులకు డెస్టినీ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 30మందికి రూ.60వేల నిత్యావసర సరుకులను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్, సంస్థ చైర్మన్ మాలోత్ సోను రాజ్‌పుథ్, డైరెక్టర్ మాలోత్ కిషన్, సీరోలు మండల ఉపాధ్యక్షుడు మలిశెట్టి వేణు, నాయకులు మల్లయ్య, వెంకన్న పాల్గొన్నారు.

మహబూబాబాద్ రూరల్: కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య బుధవారం ఘనపురపు సేవా ట్రస్టును ప్రారంభించారు. ఇందులో భాగంగా మొదటి రోజున 26, 17వ వార్డుల పరిధిలోని వరద బాధితులకు నిత్యావసర వస్తువులను ఘనపురపు సుభాషిణి, అంజయ్య పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ సుభాషిణి, అంజయ్య, ట్రస్టు డైరెక్టర్ మందాటి శ్రీను పాల్గొన్నారు.

టీచర్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

మరిపెడ రూరల్: మండలంలోని సీతారాంతండా వాసులకు తొర్రూరు టీచర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అధైర్య వద్దు.. మేమున్నామంటూ ముందుకు వచ్చారు. స్థానిక తహసీల్దార్ సైదులు చేతుల మీదుగా బాధిత సీతారాంతండా బాధితులకు ఆహార ప్యాకెట్లు, పండ్లు, వాటర్ బాటిల్స్, పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీచర్స్ క్లబ్ అధ్యక్షుడు చింతల సురేష్, ప్రధాన కార్యదర్శి వెలిదే సురేష్ కుమార్, ఎద్దు వెంకన్న, సూరం ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

డోర్నకల్: మండలంలోని ముల్కలపల్లి గ్రామంలో ఆకేరు వరద ముంపునకు గురైన ఇళ్ల బాధితులకు బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు తాళ్లూరి గంగాధర్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బత్తుల శ్రీనివాస్‌యాదవ్, డీఎస్ జగదీష్, తాళ్లూరి హనుమంతరావు, ఎడమకంటి రవి తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో..

నెల్లికుదురు: జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులను అధికారులతో కలిసి అందించినట్లు సొసైటీ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలోని రావిరాల గ్రామంలో వరద బాధితులకు నిత్యావసర సరుకులతో పాటు దుప్పట్లు అందించార. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జినుగు మరియన్న, తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ బాలరాజు, వైస్ చైర్మన్ నెహ్రూనాయక్ పాల్గొన్నారు. మండలంలోని రావిరాల గ్రామంలో వరదల కారణంగా మృతిచెందిన దాసరి సాలమ్మ కుటుంబానికి మాల మహానాడు ఆధ్వర్యంలో బియ్యం నిత్యావసర సరుకులను అందించారు.

దెబ్బతిన్న రోడ్ల పరిశీలన



నెహ్రూసెంటర్: కాలనీలో పర్యటిస్తున్న సీపీఐ బృందం

నెహ్రూసెంటర్: వర్షాల కారణంగా మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో ధ్వంసమైన రోడ్లు, డ్రెయినేజీల పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 25, 36 వార్డుల్లో బుధవారం సీపీఐ బృందం పర్యటించింది. కార్యక్రమంలో పెరుగు కుమార్, మంద శంకర్, మాలోత్ రవీందర్, తండ శ్రీనాథ్, మంచినీళ్లరాకేష్, బయ్య శ్రీను, బొమ్మెర మధు, పద్మ, గంగా, శ్రీలత కాలనీవాసులు పాల్గొన్నారు.

కొత్తగూడ: వర్షాల కారణంగా దెబ్బ తిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వాసం సారయ్య డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ అధ్వర్యంలో దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు జాడి సారయ్య, రాంచందర్, ప్రవీణ్, రవీందర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలి



గార్ల సీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్

గార్ల: మండల కేంద్రంలోని సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ (డీసీహెచ్‌ఎస్) వెంకట్రామ్‌లు అన్నారు. బుధవారం సీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి.. వైద్యులు, సిబ్బంది హాజరుపట్టికను పరిశీలించారు. విధుల్లో అలసత్వం వహించిన వైద్య సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. వైద్యం సక్రమంగా అందుతుందా లేదా.. రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో రాత్రి సమయంలో డాక్టర్లు ఉండడంలేదని, నైట్ డ్యూటీ డాక్టర్‌ను నియమించాలని పలువురు ఆయనను కోరారు. త్వరలో నైట్ డ్యూటీ డాక్టర్‌ను నియమిస్తామని ఆయన పేర్కొన్నారు. ఆస్పత్రిలో మందుల కొరత లేకుండా చూసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. అనంతరం ఆస్పత్రిలో పనిచేస్తున్న సాయి ఏజెన్సీ ఉద్యోగులు తమకు 8 నెలలుగా వేతనాలు రావడం లేదని, చాలా ఇబ్బందిగా ఉందని ఆయనకు వినతిపత్రం అందజేశారు. త్వరలో సమస్య పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీధర్‌గౌడ్, డాక్టర్ హనుమంతరావు, హెడ్ స్టాఫ్‌నర్సు స్వాతి, రమ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సక్రమంగా సర్వేచేయాలి



నర్సింహులపేట: వరిని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల

నర్సింహులపేట: భారీ వర్షాలకు, వరదకు నష్టపోయిన పంటలను సక్రమంగా సర్వే చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ నిర్మల అధికారులను అదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని పెద్దచెరువు కింద భారీ వరదకు ఇసుక మేటలు పేరుకుపోయిన పంటపొలాలను ఆమె సందర్శించారు. కార్యక్రమంలో ఏడీఏ విజయ్‌చందర్, ఏఓ వినయ్‌కుమార్, ఏఈఓ పాల్గొన్నారు.

పంటల్లో జాగ్రత్తలు తీసుకోవాలి

మహబూబాబాద్ రూరల్: ప్రస్తుతం జిల్లాలో కురుస్తున్న వర్షాలకు రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.విజయనిర్మల అన్నారు. డీఏఓ కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ.. రైతాంగాన్ని అప్రమత్తం చేస్తూ వ్యవసాయ పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు.

ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం

తొర్రూరు రూరల్: భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించి నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామని మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీదేవి అన్నారు. బుధవారం మండలంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు.

డోర్నకల్: మండలంలోని చిలుకోడు గ్రామ పరిధిలో బుధవారం వ్యవసాయ అధికారి మురళీమోహన్, వ్యవసాయ విస్తరణ అధికారి అవినాష్ ఆధ్వర్యంలో వర్షాలతో దెబ్బతిన్న పంటను పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేశారు.

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లిలో నష్టపోయిన పంటలను బుధవారం ఏఓ తిరుపతిరెడ్డి క్షేత్రస్థాయిలో సందర్శించి వివరాలు నమోదు చేశారు.

దెబ్బతిన్న చెరువులను పునరుద్ధరిస్తాం..

దంతాలపల్లి: మండలంలో దెబ్బతిన్న చెరువులను త్వరలోనే పునరుద్ధరిస్తామని ఎస్సారెస్పీ ఈఈ సమ్మిరెడ్డి అన్నారు. మండలంలోని తెగిన దాట్ల కోమిటి కుంట, గున్నెపల్లి రామసంద్రం, ఆగపేట హనుమంతుని చెరువు, రేపోణి గ్రామంలో ఊర చెరువును బుధవారం పరిశీలించారు.

వాగుల పరిశీలన

గంగారం: మూడురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల్లో చెరువులు మత్తళ్ల పోయడం వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. గంగారం మండలంలోని కోమట్లగూడెం చెరువు మత్తడి పోస్తుండడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. దీంతో మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు పరిశీలించారు. కార్యక్రమంలో గూడూరు సీఐ బాబురావు, గంగారం ఎస్సై రవి కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను జాగ్రత్తగా చూసుకోవాలి

గూడూరు: వర్షాల వల్ల సీజనల్ జ్వరాలతో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తగా చూసుకోవాలని ఐటీడీఏ ఏటూరునాగారం పీఓ చిత్రా మిశ్రా అన్నారు. మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర, బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల, దామరవంచ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను బుధవారం పీఓ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో మౌలిక వసతులను పరిశీలించి, విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తూ, ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూసుకోవాలని సూచించారు. అదే విధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే దారిలో కిలోమీటరు రోడ్డు సరిగా లేదని, సీసీ లేదా బీటీ రోడ్డు వేయించాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు కోరారు. కాగా కళాశాలకు వెళ్లి పరిశీలించిన పీఓ.. రోడ్డు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానన్నారు. ఐటీడీఏ ఏఈలు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య సేవలందించాలి

కురవి: అధిక వర్షాలతో గ్రామాల్లో ప్రజలకు వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని, గ్రామాల్లో వైద్య సిబ్బంది వైద్య సేవలందించాలని జిల్లా కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బలపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆఫీసర్ శ్రీనివాస్, స్రవంతి, యశస్విని, విజయ పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

తొర్రూరు రూరల్: మండలంలోని గుర్తూరు మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న ఫిజిక్స్ సబ్జెక్ట్‌ను బోధించేందుకు తాత్కాలిక పద్ధతిలో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సునీత బుధవారం తెలిపారు. ఎమ్మెస్సీ ఫిజిక్స్, బీఈడీ అర్హత ఉన్న అభ్యర్థులు ఈనెల 6న ఉదయం 10గంటలకు స్కూల్‌లో జరిగే ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలన్నారు.

వరద బాధితులకు అండగా ఉంటాం



కేసముద్రం: దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్/కేసముద్రం/నెల్లికుదురు: భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన వారిని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, అధైర్యపడొద్దని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే వర్షాలతో నష్టపోయిన బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ.. నష్టపోయిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందన్నారు. కేసముద్రం, ఇనుగుర్తి మండలాల్లోని ఉప్పరపల్లి, ఇంటికన్నె, సర్వాపురంతండా జీపీ, రాజీవ్‌నగర్‌తండాలో నీట మునిగిన ఇళ్లను, నీటమునిగిన పంట పొలాలను, తెగిన చెరువు కట్టలను ఎమ్మెల్యే సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



వైద్య శిబిరంలో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ మురళీధర్

పెద్దవంగర: జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని డీఎంహెచ్‌ఓ మురళీధర్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరం, ఇతర సమస్యలు ఉన్న వారిని పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం పల్లె దవాఖానను సందర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. జ్వర సర్వేలో గుర్తించిన వారికి ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు చేసి అవసరమైన వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వేణుమాధవ్, పంచాయతీ కార్యదర్శి నరేష్, ఏఎన్‌ఎం హరిత, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

అదృశ్యమైన మహిళ చెరువులో శవమైంది..

గూడూరు: భర్త మద్యానికి బానిస అయ్యాడని, కడుపులో బిడ్డ అనారోగ్యంతో పెరుగుతుందని తెల్సుకున్న ఓ నిండు గర్భిణి మనస్తాపానికి గురై సమీప చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. మండలంలోని భూపతిపేటకు చెందిన భైరి మమత అనే నిండు గర్భిణి సోమవారం రాత్రి ఇంటి నుంచి అదృశ్యమైన విషయం తెలిసిందే. బుధవారం ఉదయం గ్రామ సమీప చెరువు కట్టపై నుంచి ఓ రైతు చెరువులో శవం తేలుతుండడం చూసి గ్రామస్తులకు సమాచారం అందించాడు. కుటుంబ సభ్యులు అదృశ్యమైన భైరి మమత అని గుర్తించారు. పోలీసులు మృతదేహాన్ని బయటికి తీయించి పోస్టుమార్టం తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.గిరిధర్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

నెల్లికుదురు: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లికుదురు గ్రామానికి చెందిన తెలిపోలు నరేష్ (36) తాగుడుకు బానిసై మద్యం మత్తులో ఈనెల 3న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు, మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కారు, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

దంతాలపల్లి: మండలకేంద్రంలో కారు, బైకు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హన్మకొండ రాంనగర్‌కు చెందిన సేరెల్ల ఎల్లయ్య తన ఇన్నోవాపై సొంత పనుల నిమిత్తం ఖమ్మం వెళ్తున్నాడు. మండలంలోని బొడ్లాడ గ్రామానికి చెందిన పొట్టకార్ల వంశీ, గౌరి సంజయ్‌లు బైక్‌పై వస్తున్నారు. పోలీస్‌స్టేషన్ సమీపంలో రెండు వాహనాలు ఢీకొన్నాయి. బైక్‌పై వెళ్తున్న ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో 108 తొర్రూరు ఆస్పత్రికి తరలించారు.

సంక్షిప్త సమాచారం

రహదారికి మరమ్మతులు

మరిపెడ రూరల్: ఇటీవల అతి భారీ వర్షాలకు మండలంలోని పురుషోత్తమాయగూడెం బ్రిడ్జి సమీపంలోని 365 జాతీయ రహదారి విషయం విధితమే. దీంతో అధికారులు రహదారి పనులను చేపట్టారు.

వరద బాధితులను ఆదుకోవాలి

కురవి: మండలంలోని మోద్గులగూడెం గ్రామంలో యాదవ బజార్‌లోని వరద బాధితులను ఆదుకోవాలని సీపీఎం మండల నాయకుడు కట్ల కృష్ణయ్య బుధవారం డిమాండ్ చేశారు.

కోతకు గురైన రోడ్డు పరిశీలన

కురవి: సీరోలు మండలం కొత్తూరు(సీ) గ్రామ శివారులో వర్షానికి కోతకు గురైన రోడ్డును సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, సీరోలు ఎస్సై సీహెచ్.నగేష్ బుధవారం పరిశీలించారు.

సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి



గూడూరు: ఏజెన్సీ మారుమూల మండల కేంద్రమైన సీహెచ్‌సీలో తప్పకుండా సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని వైద్యవిధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ వెంకట్రాములు అన్నారు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పేషంట్ల రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ వీరన్న, సిబ్బంది పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లొద్దు

నెల్లికుదురు: భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా ఎవ్వరు చేపల వేటకు వెళ్లరాదని ఎస్సై చిర్ర రమేష్‌బాబు సూచించారు. మండలంలోని రావిరాల క్రాస్ రోడ్డు స్టేజీ వద్ద చేపల వేటకు వెళ్లే వారికి బుధవారం కౌన్సెలింగ్ చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ రాగి వైరు చోరీ

కొత్తగూడ: మండలంలోని పాగుళ్లపల్లి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి రాగి తీగను చోరీ చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాగుళ్లపల్లి గ్రామానికి చెందిన బైరబోయిన మొగిళి, వెంకన్న రైతులకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్ మంగళవారం రాత్రి రాగి వైర్ చోరీ చేశారు. ఇప్పటి వరకు మండలంలో 9 ట్రాన్స్‌ఫార్మర్ల రాగి వైరు చోరీకి గురైంది. ఈమేరకు ఏఈ సురేష్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దెబ్బతిన్న ఇళ్ల పరిశీలన

బయ్యారం: మండలంలోని వెంకట్రాంపురం, ఉప్పలపాడు పంచాయతీ పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్ విజయ ఆధ్వర్యంలోని అధికారుల బృందం బుధవారం పర్యటించింది. దెబ్బతిన్న ఇళ్లు, పంట పొలాలతోపాటు ఆయా పంచాయతీల్లోని పారిశుద్ధ్య సమస్యలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దైవాధీనం, ఏఓ రాంజీ, ఎస్సై తిరుపతి పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు.. తప్పిన ప్రమాదం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని వీఎస్.లక్ష్మీపురం గ్రామానికి చెందిన మీసాల సోమయ్య, మంగమ్మ ఇల్లుపైకప్పు వర్షం వచ్చి బుధవారం కూలిపోయింది. పైకప్పు కూలిన సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవటం వల్ల ప్రాణనష్టం తప్పింది. ఘటన స్థలాన్ని పంచాయతీ కార్యదర్శి మహేశ్వరీ సందర్శించి ఉన్నత అధికారులకు నివేదించారు.

పాఠశాలలో తడిసిన సామగ్రి

దంతాలపల్లి: మండలంలోని దాట్ల గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పాఠశాలలో వరదనీరు చేరి సామగ్రి మొత్తం తడిసింది. బుధవారం ఉదయం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు చూసి, సమాచారం ఉన్నత అధికారులకు తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి రాము, తహసీల్దార్ శ్రీలక్ష్మి, ఎంపీడీఓ వివేక్‌రామ్‌తో కలిసి పాఠశాలను పరిశీలించారు. సుమారు రూ.6లక్షల వరకు నష్టం జరిగిందని ఉపాధ్యాయులు తెలిపారు.

రక్షణ గోడ నిర్మాణానికి కృషి

కురవి: నల్లెల్ల పెద్ద చెరువు ద్వారా ముంపునకు గురయ్యే ప్రాంతంలో రక్షణ గోడను నిర్మించేందుకు కృషి చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్ అన్నారు. బుధవారం నల్లెల్ల గ్రామంలో చెరువు ముంపునకు గురైన ప్రాంతాన్ని, బాధితుల ఇళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు వేణు, మల్లయ్య, వెంకన్న, కందయ్య పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

తొర్రూరు: రక్తదానం ప్రాణదానంతో సమానమని వాసవీక్లబ్ రీజియన్ చైర్మన్ ప్రొద్దుటూరి గౌరీశంకర్ అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బిజ్జాల అనిల్, ప్రధాన కార్యదర్శి రాము పాల్గొన్నారు.

మట్టి గణపతులను ప్రతిష్ఠించాలి

తొర్రూరు: మట్టి గణపతులను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడాలని ఎస్సై జి.ఉపేందర్ అన్నారు. మదర్ వలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్లను బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ఆవిష్కరించారు.

చెరువుల అభివృద్ధికి చర్యలు

తొర్రూరు రూరల్: నీటి ప్రవాహానికి తట్టుకొని ఉండేందుకు చెరువుల అభివృద్ధికి నిరంతరం చర్యలు తీసుకుంటున్నామని నీటి పారుదలశాఖ ఏఈ శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని వెలికట్ట గ్రామ ఊర చెరువు కరకట్ట ప్రమాదకరంగా ఉందని గుర్తించి మరమ్మతు పనులను చేపట్టారు. కార్యక్రమంలో డీటీ నర్సయ్య, కార్యదర్శి కోల ప్రభు, వీఆర్‌ఏ వెంకన్న, నాయకులు దేవేందర్‌రాజు, ఢీకొండ శ్రీనివాస్, సోమన్న, ప్రభాకర్, కృష్ణ, మల్లేశ్ పాల్గొన్నారు..

పంటల వివరాలు సేకరించాలి

మహబూబాబాద్ రూరల్: ఇటీవల కురిసిన అధిక వర్షాలకు నష్టపోయిన పంటల వివరాలను ఏఓలు, ఏఈఓలు సేకరించాలని డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఏ.శ్రీనివాస్ అన్నారు. నష్టం వాటిల్లిన పంటల వివరాలు సేకరణపై మహబూబాబాద్ రైతు వేదికలో బుధవారం ఏడీఏ శ్రీనివాస్ సమీక్ష నిర్వహించారు. తప్పుడు వివరాలు నమోదు చేస్తే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కార్యదర్శిని తొలగించాలని ధర్నా

కురవి: సీరోలు మండలం కాంపల్లి శివారు బీల్యానాయక్ తండా గ్రామ పంచాయతీ కార్యదర్శిని వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ తండావాసులు బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా తండా నాయకుడు బానోత్ దేవేందర్‌నాయక్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శి లక్ష్మినారాయణ సక్రమంగా విధులకు హాజరుకావడం లేదన్నారు. పారిశుద్ధ్య పనులు చేయించడం లేదని ఆరోపించారు. గ్రామంలో ప్రజలు వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారని, దోమల మందు స్ప్రే చేయించడంలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు రమేశ్, సేట్యా, రవి, శ్రీను, అమర్‌నాథ్, బబ్లూ చంద్రా, జగ్నా పాల్గొన్నారు.

బస్టాండ్‌లోనే దశదినకర్మ



దశదిన కర్మ నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులు

కేసముద్రం: సొంత ఇల్లు లేని ఓ వ్యక్తి జ్వరంతో మృతి చెందగా, అతడి దశదినకర్మను ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహించిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కేసముద్రంస్టేషన్ శివారు బ్రహ్మంగారితండాలో 35 యేళ్ల క్రితం వచ్చి ఒంటరిగా జీవిస్తున్న ఓర్సు మల్లయ్య అనే వ్యక్తి, గత నెల 26న జ్వరంతో మృతి చెందాడు. ఈ మేరకు మృతుడికి ఇల్లు లేకపోవడంతో అతడి మృతదేహాన్ని తండావాసులు స్థానిక బస్టాండ్‌కు తరలించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. లయన్స్‌క్లబ్ కేసముద్రం సభ్యులు, బ్రహ్మంగారి తండావాసులు కలిసి, గత నెల 27న అంత్యక్రియలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈమేరకు మృతుడి భార్య మల్లమ్మ, కుమారులు ఐలయ్య, కుమార్, ఇద్దరు కుమార్తెలు స్వరూప, ప్రమీల అంత్యక్రియలకు హాజరై, కార్యక్రమాలు నిర్వహించారు. ఆ తర్వాత వారికి ఇక్కడ ఇల్లు లేకపోవడంతో బస్టాండ్‌లోనే ఉండిపోయారు. ఈమేరకు బుధవారం మల్లయ్య దశదినకర్మ కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులు నిర్వహించారు.